ప్రజాశక్తి

ఆదివారం 19 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కులగణన సర్వేలో

నిర్లక్ష్యం వహించొద్దు..

- వివరాల నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు
- వలస వెళ్లిన వారి వివరాలు నమోదు చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈ నెల 27 నుంచి నిర్వహించే కులగణన సర్వేలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. నమోదు ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కులగణన సర్వే నిర్వహించాల్సిన తీరుపై శనివారం జెసి కె.శ్రీనివాసులుతో కలిసి కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులాల వివరాలను నమోదు చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఇంటిలోని వారి వివరాలను నమోదు చేశాక వాలంటీర్, సచివాలయ ఉద్యోగి తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని స్పష్టం చేశారు. సర్వే పూర్తయ్యేంత వరకు ఈ వివరాలను నమోదు చేస్తున్న మొబైల్ ఫోన్‌ను కూడా మార్చరాదని తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో మండల స్థాయిలో, 22న సచివాలయాల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సర్వే జరుగుతున్న తీరును డివిజన్‌స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎస్.లక్ష్మా నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పి.జగన్నాధరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎం.అంజల, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఏ.సునీల్ కన్నా, సచివాలయాల నోడల్ అధికారి టి.ఉషారాణి, జడ్పీ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్.సుబ్బారావు, జిల్లా డిప్యూటీ సిఇఒ సి.హనుమంతరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'జాయింట్' కష్టాలు..!

- విద్యాదీవెన పథకం పొందడానికి విద్యార్థులు, వారి తల్లులకు తిప్పలు
- ఉమ్మడి ఖాతాల పేరుతో తరగతులు కోల్పోతున్న విద్యార్థులు
- రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- 24వ తేదీ గడువు ముంచుకొస్తుండటంతో ఆందోళన

పొదిలిలో విద్యార్థులు, తల్లులతో కిక్కిరిసిన బ్యాంక్

ప్రజాశక్తి-పొదిలి

విద్యాదీవెన పథకం కోసం బ్యాంకులో విద్యార్థి, తల్లి పేర్లతో జాయింట్ అకౌంట్ తెరవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో బ్యాంకు అకౌంట్ కోసం తల్లులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు నాలుగు సంవత్సరాలుగా ఈ పథకాల నిధులు తల్లుల బ్యాంకు ఖాతాల్లో పడుతున్నాయి. అకస్మాత్తుగా తల్లికి, పిల్లలకు జాయింట్ అకౌంట్ కావాలనడంతో విద్యార్థులకు, వారి కుటుంబసభ్యులకు తిప్పలు తప్పడం లేదు. గత వారం రోజులుగా ఈ ఖాతాల అనుసంధానం కోసం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు వదిలి బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు.

ప్రాథమిక విద్య నుంచి ఉన్నత స్థాయి వరకు అమలవుతున్న విద్యా దీవెన పథకాలకు సంబంధించి గత ఏడాది వరకు డబ్బులు తల్లి అకౌంట్‌లో పడ్డాయి. ఏడాది క్రితం విద్యార్థుల కుటుంబసభ్యులకు చెందిన ఆదాయ, ఆస్తి పత్రాల ధ్రువీకరణ, ఈకేవైసీ నమోదు వంటి కారణాలతో కొంతమంది లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల్లో కోత పడింది. ఓ వైపు సంక్షేమం అందరికీ అందిస్తామని హామీలు ఇస్తూనే మరో వైపు ఇలాంటి నిబంధనలతో కోతలు పెడుతున్నారనే వాదన ఉంది. ఇప్పటివరకు అవసరాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి తల్లికి ఒకచోట, పిల్లలకు మరొకచోట బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ఇప్పుడు వాటిని అనుసంధానం చేయాలంటే ఎక్కడో ఒకచోట ఖాతా ఎవరో ఒకరు తొలగించుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలతో పాటు బ్యాంకులకు ఆధార్ అనుసంధానం చేయడంతో ఈ తొలగింపు ప్రక్రియ అంత త్వరగా అయ్యే అవకాశాలు లేవు. ఈ తతంగం రోజుల తరబడి కొనసాగుతోంది. దీని కోసం పిల్లలు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు వదిలి బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో విద్యాసంస్థల్లో చదువుతున్న వారు తరగతులకు ఎగనామం పెట్టి తప్పనిసరి పరిస్థితుల్లో ఇళ్లకు వచ్చారు. జాయింట్ అకౌంటు చేయడానికి రెండు, మూడు రోజులకు పైగా సమయం పడుతుండడంతో వారు విద్యా సంవత్సరం మధ్యలో తరగతులు పోతున్నాయని వాపోతున్నారు. బ్యాంకుల్లో ఖాతాలను జాయింట్ చేయడానికి ఆన్‌లైన్‌లో వారం రోజుల వరకు సమయం పడుతోందని బ్యాంక్ అధికారులు అంటున్నారు. దీనికి తోడు పిల్లలు తల్లులతో బ్యాంకులు కిక్కిరిసిపోవడంతో పాటు, ఆన్‌లైన్ ▶ 2లో

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

20, 21 తేదీల్లో మున్సిపల్ కార్మికుల నిరసనలు

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు చీకటి శీనివాసరావు

▲ 8లో

గుంతలూ పూడ్చలేని ప్రభుత్వం

- చంద్రబాబునాయుడు వస్తేనే రోడ్ల అభివృద్ధి
- ఒంగోలులో టిడిపి, జనసేన నిరసన

రోడ్డు గుంతలను పరిశీలిస్తున్న టిడిపి, జనసేన నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రహదారులలో ఏర్పడిన చిన్నచిన్న గుంతలను కూడా పూడ్చలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ధ్వజమెత్తారు. రహదారుల దుస్థితిపై ఒంగోలు నగరంలో టీడీపీ, జనసేన సంయుక్తంగా 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' పేరుతో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొప్పోలు రోడ్డులోని రహదారిపై ఉన్న గుంతల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు వణికిపోతున్నారని, రాష్ట్రంలో రహదారులపై ఉన్న గోతులు చెరువులను తలపిస్తున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం కనీసం రహదారులను నిర్మించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో 25 వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్లు వేసినట్టు తెలిపారు. టిడిపి, జనసేన కలిసి వచ్చే ఎన్నికల్లో సైకో జగన్‌ను గద్దె దింపుతాయన్నారు. దాచుకోవడం, దోచుకోవడం తప్ప ఒంగోలు ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిన అభివద్ధి ఏమీ లేదన్నారు. నియోజకవర్గంలో ఉన్న కొండలను, ఇసుక క్వారీలను మొత్తం దోచేశాడని, ప్రజలకు అవసరమైన రోడ్లు కనిపించలేదా.? అని ప్రశ్నించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రోడ్లు మరింత అధ్వానంగా ఉన్నాయని, రోడ్లు నరకానికి రహదారులుగా ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారులను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, షేక్ కపిల్ బాషా, టిడిపి డివిజన్ అధ్యక్షులు మునీంద్ర, నడిపినేని భాస్కర్, బండారు మదన్, బెజవాడ మురళి, కె.కుసుమకుమారి, పసుపులేటి సునీత, జనసేన నగర అధ్యక్షులు మలగా రమేష్, చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా..

బాపట్లను అభివృద్ధి చేయాలి

- బాలలకు విముక్తి, పునరావాసం కలించాలి
- అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్లను బాలకార్మిక రహిత జిల్లాగా అభివృద్ధిలోకి తెచ్చేలా అధికారులు కషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నుంచి బాలలకు విముక్తి, పునరావాసం కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. జాతీయ బాలల సంరక్షణ కమిటీ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించామన్నారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ కమిటీ విస్తతంగా తనిఖీలు చేయాలని చెప్పారు. 14 సంవత్సరాల లోపు చిన్నారులంతా పాఠశాలలోనే ఉండాలని స్పష్టం చేశారు. చిన్నారులు బడిబయట లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 14 నుంచి 18 సంవత్సరాలలోపు కౌమారదశలోని బాలబాలికలు బాల కార్మిక వ్యవస్థకు గురి కాకుండా చూడాలన్నారు. నిర్బంధంగా పని చేయించడం చట్టరీత్యా నిషేధమన్నారు. ప్రమాదకరమైన పరిస్థితులలో ▶ 2లో

అడుగంటిన పాలేరు

ఆందోళనలో పశుపోషకులు

ప్రజాశక్తి-పిసిపల్లి

పాలేరునదిలో నీరు అడుగంటడంతో పశు పోషకులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవకపోవడం, నవంబరులో కూడా వేసవిని తలపించేలా వేడి వాతావరణం ఉండటంతో నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో పాలేటిపల్లి నుంచి ప్రవహిస్తున్న పాలేరు నది ప్రవాహం ఈ సంవత్సరం వేసవికి ముందే ఆగిపోయింది. గతంలో మడుగుల్లో నీరు ఉండేది. గత నాలుగు సంవత్సరాల కాలంలో ప్రవహించి పశుపోషకులకు ఎంతో ఆసరాగా ఉంది. ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడం మూలంగా నీటి ప్రవాహం లేదు. గతంలో పెద్దపెద్దమడుగుల్లో నీరు ఉండేది. ఈ సంవత్సరం పెద్దమడుగుల్లో కూడా ఎండిపోయి అక్కడక్కడా పాచిపట్టిన మురుగు నీరు మాత్రమే ఉంది. వర్షాలు లేకపోతే డిసెంబర్ నాటికి పాలేటిలో చుక్క నీరు కనపడదు. పాలేటిపల్లి, ముద్దపాడు, వాతంవారిపల్లి, బట్టుపల్లిలో సుమారు 10 వేల పశువులకు గతంలో ఉపయోగకరంగా ఉండేది. కొద్దోగొప్పో వర్షాలు పడిన పాలేటిలో నీరు ఉండడం మూలంగా పాలేటి సమీపంలో గేదెలను మేపుకుంటూ అక్కడే నీరు తాపుకుంటూ కాలం వెళ్లదీసేవారు. పచ్చిమేత కొరతగా ఉన్న మార్చి నెల నుంచి ఆగస్టు, సెప్టెంబర్ వరకు పశువులను మేపేవారు. ఈ సంవత్సరం వర్షాలు పడకపోవడంతో ఆగస్టు నెల నుంచే వాగు ఎండిపోయింది. ప్రస్తుతం వాగు పరివాహక ప్రాంతంలో 100 పశువులను కూడా మేపడం లేదు. గతంలో ఆగస్టు నుంచే వాగుకు ఇరువైపులా పాలేటిపల్లి నుంచి రేగడ వరకు సుమారు 10వేల పశువులు, నాగులు వేల గొర్రెలు దర్శనమిచ్చేవి. ఈ సంవత్సరం గొర్రెలు కానీ, పశువులు కానీ పెద్దగా కనిపించడం లేదు. మరో నెల తరువాత పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. వాగుకు ఇరువైపులా పచ్చిగడ్డి లేకపోవడం నీళ్ల లేకపోవడం వలన ఇప్పటికే చాలా మంది ఇండ్ల వద్ద పశువులను కట్టివేస్తున్నారు. గొర్రెలకు కూడా మేత, నీరు లేకపోవడంతో అమ్మేస్తున్నారు. సకాలంలో వర్షాలు పడక పొలాలన్నీ బీడుగా మారాయి. పాలేటిలో నీటి సౌకర్యం లేకపోవడం వలన జీవాలకు ఇబ్బందిగా ఉంది.

ఇంటివద్దే పశువులను కట్టేస్తున్నా: బత్తుల వెంకటేశ్వరరెడ్డి, బట్టుపల్లి

పాలేటిలో నీరు, చుట్టుపక్కల పచ్చగడ్డి లేకపోవడంతో మాకున్న ఆరు పశువులను ఇంటి వద్దే కటేస్తున్నాను. మూడు గేదెలు పాలు ఇస్తున్నప్పటికీ పొలంలో పచ్చగడ్డి లేకపోవడం తమకున్న పొలంలో జొన్న గడ్డి వేసి పశువులను మేపుకుంటున్నాం. గత సంవత్సరం నవంబర్ నెలలో పాలేరు ప్రవహించి పుష్కలంగా గడ్డి, నీరు దొరికింది. ఈ సంవత్సరం ఇప్పుడే పాలేరు ఎండిపోవడం, గడ్డి లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

నీటి ప్రవాహం నిలిచిపోయిన పాలేరు నది

'జాయింట్' కష్టాలు.!

(మొదటిపేజీ తరువాయి)

ఇతర సర్వర్ల మొరాయింపుతో తీవ్ర కాలయాపన జరుగుతోందని, వందలాది ఖాతాలను అనుసంధానం చేయడానికి ఎక్కువ రోజులు నిరీక్షించాల్సి వస్తోందని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఇప్పటికిప్పుడు హఠాత్తుగా తల్లి, పిల్లల ఖాతాలు అనుసంధానం చేయాల్సిన అవసరం ఏముందని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. రాబోయే కాలంలో పథకాల్లో కోత పెట్టేందుకే ఇటువంటి ఆదేశాలు ప్రభుత్వం ఇచ్చి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐటీ రిటర్న్స్, ఇతర ఆర్థిక వ్యవహారాల పేరుతో కొందరికి ప్రభుత్వ పథకాల్లో కోత పెడుతున్నారు. ఇప్పుడు ఇలాంటి నిబంధనల ద్వారా కూడా ప్రభుత్వ పథకాలకు మరిన్ని కోతలు పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తల్లీపిల్లల ఖాతాల అనుసంధానం ద్వారా ఇప్పటికే వారికి ఉన్న ఫోన్‌పే, గూగుల్‌పే, చెక్కుబుక్కులు కొన్ని రద్దయ్యే అవకాశం ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ జాయింట్ ఖాతాల సందర్భంగా బ్యాంకు అధికారులు కూడా కొన్ని సేవలు తగ్గించుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

ఇప్పటివరకు బాగానే ఉంది
ఇంటర్ విద్యార్థి

మాకు ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలు బాగానే అందుతున్నాయి. మా అమ్మ ఖాతాలోనే డబ్బులు పడుతున్నాయి. నేను విజయవాడ నలందలో ఇంటర్ చదువుతున్నా.. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం తల్లి ఖాతాలో వేస్తేనే బాగుంటుంది. ఇప్పుడిలా మధ్యలో ఇటువంటి అనుసంధానం చేయడం వల్ల క్లాసులు మిస్ అవుతున్నాం..

బాపట్లను అభివృద్ధి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

బాలలు పనిచేయడం నేరంగా పరిగణించాలని తెలిపారు. తహశీల్దార్లు వారి పరిధిలోని మండలాలలో ప్రత్యేకడ్రైవ్ చేపట్టాలన్నారు. అధికారులంతా మానవతాదక్పథంతో పనిచేయాలని కోరారు. బాలకార్మికులుగా ప్రభావితమయ్యే ప్రాంతాలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. బాపట్ల జిల్లాలో అధికంగా పరిశ్రమలు ఉన్న ప్రాంతాలలో మార్టూరు, చీరాల, బల్లికురవ, బాపట్ల మండలాలు ఉన్నాయన్నారు. ఇటుకబట్టీల తయారీలో అద్దంకి, కొల్లూరు మండలాలు ఉండగా.. చేపలు, రొయ్యల హేచరీలు బాపట్ల, నిజాంపట్నం, చీరాలలో ఉన్నాయన్నారు. జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు వేటపాలెంలో ఉండగా, గనులు, క్వారీలు బల్లికురవ, మార్టూరు, పత్తి పరిశ్రమలు పర్చూరు, ఇంకొల్లు మండలాలు, జాతీయ రహదారిపై దాబాలు, పట్టణాలలో హెూటళ్లు, షాపులలో తనిఖీలు చేయాలన్నారు. తల్లిదండ్రులు లేని అనాథలు, తల్లి లేదా తండ్రి లేని పాక్షిక అనాథలు ఉంటే వారిని ఆనంద నిలయంలో చేర్చాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి రిస్క్యూతో విముక్తి కల్పిస్తే అలాంటి వారికి తక్షణమే ఆశ్రయం, పునరావాసం కల్పించడంతో పాటు ఉచితంగా విద్య, వైద్యం, వసతి కల్పించాలని తెలిపారు. అధికారులు ప్రణాళికతో సమిష్టిగా పని చేయాలన్నారు. సమావేశంలో కమిటీ నోడల్ అధికారి, డిఆర్‌ఓ పి.వెంకటరమణ, కార్మికశాఖ సహాయ కార్మిక కమిషనర్ డివి.శివప్రసాద్, డీఈఓ టీవీ రామారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని జె.రాజా దిబోరా, సిడబ్ల్యుసి సభ్యులు దుర్గాభవాని పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణ పట్ల అవగాహన

ప్రజాశక్తి-వేటపాలెం

కుష్టు వ్యాధి నివారణ, సమాజంలో వివక్ష గురించి చీరాల డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్-1 మెహందీహసన్ విద్యార్థులకు వివరించారు. శనివారం వేటపాలెం మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఒంటిపై ఉన్న మచ్చలను పరిశీలించారు. కుష్టు వ్యాధిని నయం చేసేందుకు ఎండిటి చికిత్స గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం పీహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు గ్రేస్ వెంకటేశ్వర్లు, జలసూత్రం రామానుజం పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన తప్పనిసరి

ఆర్టిఓ బి అమర్ నాయక్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రోడ్డు భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో బి .అమర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తర్లపాడు రోడ్డులోని శ్రీ కమల కాన్సెప్ట్ స్కూల్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డుభద్రత పై అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆర్టీవో అమర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు భదతా నియమావళిని పాటించాలన్నారు. మైనర్ యువతి ద్విచక్రర వాహనాలను నడప రాదని ఏదైనా జరగరాని ప్రమాదం సంభవించినట్లయితే మైనర్‌కు వాహనం ఇచ్చిన వ్యక్తిపై కూడా కేస్ను నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూప్ రంజన్, మార్కాపురం ప్రాంతీయ రవాణా అధికారి ఏ.మాధవరావు, రవాణా శాఖ సిబ్బంది పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం మండలంలోని అన్ని గ్రామాల పేద ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఏడు నెలల క్రితం గ్రామాలలోని క్లినిక్ సెంటర్స్‌లో పేద ప్రజలకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద 50 వేల మందికి పైగా నమోదు చేశారు. కానీ ఇంతవరకు ఏ ఒక్కరికి కూడా ఆయుష్మాన్ భారత్ కార్డు అందజేయలేదని గ్రామాలలోని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకం తీసుకొచ్చింది. ఈ పథకంలో చేరిన పేద ప్రజలకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచితంగా నాణ్యమైన ఆరోగ్య సేవలు పొందవచ్చు. అంతేగాక ఈ పథకం ద్వారా ప్రతి ఏటా ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చు. కానీ నేటి వరకు కూడా కార్డులు అందకపోవటం పట్ల పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రేపల్లె

ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ మల్లికార్జున్‌రావు అన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన కార్యక్రమంలో తహశీల్దారు మల్లిఖార్జునరావు, కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎందుకు కలిగి ఉండాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా 18 సంవత్సరాల వయసున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఎలా నమోదు చేసుకోవాలి అనే అంశంపై వివరించారు. ఓటు హక్కు పొందటం సామాజిక బాధ్యత అన్నారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటు ఎంతో కీలకంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాకపోతే డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 264 పోలింగ్ బూత్ లు ఉన్నాయని చెప్పారు. ప్రతి బూత్‌లోనూ బూత్ లెవెల్ అధికారులు ఓటరు మార్పులు చేర్పులు తొలగింపులు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న రైతు నాయకులు

గుంటూరు ఛానల్‌ను పొడిగించాలి

ప్రజాశక్తి-పర్చూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని రైతులు కోరారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో పర్చూరు మండల రైతులు సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న పెదనందిపాడులో జరిగే నిరసన దీక్ష కార్యక్రమానికి పెద్దఎత్తున రైతులు తరలి వెళ్లేందుకు నిర్ణయించారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్ల రాజమోహనరావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, కోట హరిప్రసాద్, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఒగ్గిసెట్టి నరసింహం, తోట శివ, రైతులు పాల్గొన్నారు.

దావా సమను
అండర్ ఆర్డర్ 5 రూలు 1 & 5 ఆఫ్ సి. పి. సి
మహారాజశ్రీ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
OS NO:311/2022
యడ్లా వెంకటేశ్వరరావు ...వాది
VS
మంచి కంటి రంగనాయకులు ...ప్రతివాది
TO.
మంచి కంటి రంగనాయకులు
S/o. రంగనాథ రావు
D.no 8-66 , MSR రోడ్డు
కనిగిరి టౌన్, ప్రకాశం జిల్లా వారికి
పై నెంబర్ దావాలో పరిహారము కోరి వాది దావా దాఖలు చేసి యున్నాడు. గనుక మీకు ఆక్షేపణలు ఉన్నచో తే 5-12-2023 దిన పగలు 10-30 గం॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడర్ ద్వారా గాని హాజరై మీ వాజ్యమును తెలుపుకునేది. లేనియెడల వాజ్యమును విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుసుకునేది.
మకాం: కనిగిరి
వాయిదా తేదీ 5-12-2023
ఇట్లు
శ్రీ జె.ఎస్. బాబురావు, బి ఏ, బి ఎల్
వాది తరపు అడ్వకేట్
కనిగిరి, ప్రకాశం జిల్లా.
ఫోన్ నెంబర్: 9440843898

9న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-గిద్దలూరు

జాతీయస్థాయిలో డిసెంబర్ 9న జరిగే లోక్ అదాలత్ పై స్థానిక కోర్ట్ భవనాల సముదాయంలో శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేంద్రా రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా ధానమ్మల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పోలిసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ డిసెంబర్ 9న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కక్షిదారులు కూడా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా అవగాహనా కల్పించాలన్నారు. లోక్‌అదాలత్‌తో కోర్టుల చుట్టూ తిరగకుండా సమయం ఆదా అవుతుందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘునాథరెడ్డి, గిద్దలూరు సిఐ దేవ ప్రభాకర్, కంబం సిఐ రాజేష్ కుమార్, సెబ్ సిఐ అరుణకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు

తహశీల్దార్ సంజీవరావు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలో అక్రమంగా గ్రావెల్ తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు హెచ్చరించారు. శనివారం మైనింగ్ అధికారులు విడుదల చేసిన ఒక ప్రకటనను తాసిల్దార్ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ అధికారుల ప్రకటన ప్రకారం మండలంలోని కందులూరు గ్రామ సర్వేనెంబర్ 420 లో 110 ఎకరాలు, మర్లపాడు గ్రామ సర్వేనెంబర్ 388లో 388 ఎకరాలు, కొణిజేడు గ్రామ సర్వేనెంబర్ 769లో 390 ఎకరాలు మొత్తం కలిపి 888 ఎకరాల కొండ పోరంబోకు భూములలో గ్రావెల్ నిక్షేపాలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాలలో ఎవరైనా అక్రమ మట్టి తవ్వకాలు జరిపి సరఫరా చేసినవారు రాష్ట్ర చిన్నతరహా ఖనిజ నియమావళి 1966 ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడితే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఖనిజ నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సంజీవరావు హెచ్చరికలు జారీ చేశారు.

నాసా విజన్ ఆర్ట్స్ కాంపిటీషన్‌లో

శ్రీ చైతన్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-శింగరాయకొండ

నాసా విజన్ 2050 ఆర్ట్స్ కాంపిటీషన్‌లో శింగరాయకొండ శ్రీచైతన్య టెక్నోస్కూల్‌కి చెందిన పదవ తరగతి విద్యార్థిని కాకర్లపూడి వినతి క్యాష్ ప్రైజ్‌ని సొంతం చేసుకుంది. వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీనియర్ విభాగంలో జిల్లాలో తాను ఒక్కదానికే ఈ ప్రైజ్ రావడంతో పాఠశాల ఆర్ఐఅనిల్‌కుమార్ మరియు జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్ విద్యార్థిని అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెక్కు అందజేత

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

గత నెల ఆరవ తేదీన విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన వ్యక్తికి నష్టపరిహారం కింద విద్యుత్ శాఖ నుంచి మంజూరు అయిన రూ.5 లక్షల చెక్కును మార్కాపురం ఎమ్మెల్యే కె పి నాగార్జున రెడ్డి చేతుల మీదుగా శనివారం సాయంత్రం స్థానిక తర్లుపాడు రోడ్డులోని శాసనసభ్యులు కేపీ నాగార్జున రెడ్డి క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వివరాల్లోకెళ్తే మండలం పరిధిలోని భూపతి పల్లె గ్రామానికి చెందిన రాజ్ కుమార్ స్నానం చేసి టవలను దండెంపై ఆరేస్తుండగా ఇంటి పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ నుంచి ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో రాజ్ కుమార్ విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు ఏపీసిపిడిసిఎల్ అధికారులకు తెలియపరిచారు. దీంతో వారు విచారణ చేసుకొని



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

నష్టపరిహారం కింద బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించేందుకు ప్రత్యేక చొరవ చూపిన శాసనసభ్యులు కేపీ నాగార్జున రెడ్డిని రాజ్ కుమార్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ డిఈఈ టీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూబాగోతంపై సిట్‌తో విచారణ జరిపించాలి

జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

గ్రేజింగ్ గ్రౌండ్ వందల ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నా తమ పరిధిలో విషయం కాదన్నట్లు రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారంటూ జనరల్ బాడీలో జడ్‌పిటిసి ధ్వజమెత్తారు. జనరల్‌బాడీకి రెవెన్యూ సిబ్బంది గైర్హాజరీపై ఎంపిపి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో భూముల అన్యాక్రాంత విషయంలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై సిట్ అధికారులతో విచారణ జరిపించాలని జిల్లా జడ్పిటిసిల సంఘం అధ్యక్షులు, వెలిగండ్ల జడ్‌పిటిసి సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి మండల సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండలంలో వందల ఎకరాలు పశువుల మేత భూములు చదును చేసి వ్యవసాయ భూములుగా మారుస్తున్నప్పటికీ ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించవలసినటువంటి రెవిన్యూ శాఖ అమ్మకు ఎటువంటి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండడం ఎంతో విచారకరమైన విషయమని ఎద్దేవా చేశారు. జడ్‌పిటిసి మాట్లాడుతూ రిచ్ సర్వే జరిగేటప్పుడు ఆ గ్రామాల్లో

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

ప్రజాప్రతినిధుల గాని కనీసం పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం కానీ చేయడం లేదని విమర్శించారు. తహశీల్దార్ కార్యాలయానికి పక్కన ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగితే పక్కనే ఉన్న తహశీల్దార్ సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని, అది వారి అహంకారానికి నిదర్శనంగా కనిపిస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి రామనతిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు తాతపూడి మేరీ పుష్ప, ఎర్రబోయిన భారతి, సొసైటీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు. ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అధోగతి పట్టిస్తున్న 'జగన్'

టిడిపి సీనియర్ నాయకులు దొడ్డ వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాష్ట్రాన్ని అభివద్ధి చేయకుండా కేవలం కక్ష సాధింపు చర్యలు చేపట్టి రాష్ట్రాన్ని అదో పాలు చేస్తున్న ఈ సైకో ముఖ్యమంత్రిని వెంటనే తరిమి వేయాల్సిన సమయం ఆసన్నమైందని నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మరియు టిడిపి సీనియర్ నాయకులు దొడ్డ వెంకట్ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొగులూరు గ్రామ పరిధిలోని చీర్లదిన్నె రోడ్డును టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కురు గానా సింహారెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గుంతల మాయమైన రోడ్లన్నీ అవి పూర్తి చేయకుండా కేవలం టిడిపి వారిపై దౌర్జన్యం చేయటమే అతని పరిపాలన అయిందని ఆయన విమర్శించారు. నియోజకవర్గానికి టిడిపి హయాంలో 90 లక్షల వరకు తారు రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయని ఆ నిధులతో ఈ ప్రభుత్వం పూర్తి చేయకుండా

మాట్లాడుతున్న టిడిపి నాయకులు దొడ్డ వెంకటసుబ్బారెడ్డి

గుంతలమయంతో జిల్లా చెట్లతో మూసుకొని పోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్న ముఖ్యమంత్రికి ఏమీ పట్టడం లేదని ఆయన దుయ్య బడ్డారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలమీంద్రభూపాల్ రెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, కొండు విజయభాస్కర్ రెడ్డి, బొప్పరాజు లక్ష్మీనారాయణ, బాల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

క్షేమంగా విద్యార్థులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని పుట్టా వారి పాలెం అడ్డరోడ్డులో ఉన్న వెంకట పద్మశాయి స్కూల్ బస్ శనివారం ఉదయం పరిటాల వారి పాలెం గ్రామం నుండి 15 మంది విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని వస్తుండగా బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి కుందుర్రు గ్రామ సమీపంలోని చెరువులోకి దూసుకెళ్లి పూడికలో దిగబడింది. చెరువులో నీరు లేక పోవడంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ స్కూలు బస్సు పరిటాల వారి పాలెం గ్రామం నుండి కుందుర్రు, మామిళ్ళపల్లి, కొమ్మాలపాడు, ఏల్చూరు గ్రామాల మీదుగా అడ్డరోడ్డు చేరుకుంటుంది. ఎదురుగా వస్తున్న పందుల గుంపును తప్పించబోయి బస్సు చెరువులోకి దూసుకెళ్లిందని బస్సు డ్రైవర్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

శ్రీశైలం నుంచి కడపకు వెళ్తున్న ఓ కారు శిఖరం దాటిన తర్వాత బయన్నసెల సమీపంలో షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కారు బాధితుడు గాలి మురళీ మోహన్ సున్నిపెంట అగ్ని మాపక కేంద్రానికి స మా చా రం అందించాడు. హుటా హుటినా అగ్ని మాపక వాహనం అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసింది. అప్పటికే కారు దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దోర్నాల ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దగ్ధమవుతున్న కారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని సూరారెడ్డిపాలెం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సూరారెడ్డిపాలెం సమీపంలోని ఇండియన్ ఆయిల్ కంపెనీలో పంచర్ షాపు నిర్వహిస్తున్న అమ్మనబ్రోలుకు చెందిన షేక్ జానీ బాషా(55) ఐఓసీ నుంచి ఒంగోలు వైపు రోడ్డు దాటుతూ డివైడర్ దిగుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు జానీ బాషాను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ భాషా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి ఖర్చులు అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని 2వార్డులోని నరసింహ స్వామి మెట్ల వద్ద ఏరియాలో నివాసం ఉంటున్న నన్నే పీరా అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కౌన్సిలర్ బూనెబోయిన చంద్ర శేఖర్ యాదవ్ ఆ కుటుంబానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ ప్రధానకార్యదర్శి బోయిలపల్లి కిషోర్, షేక్ అలిబాషా పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పొదిలి : పొదిలి నగర పంచాయతీ పరిధిలోని బాప్టిస్ట్‌పాలెంలో శుక్రవారం నవంబర్ 17న అనారోగ్య కారణాలతో మరణించిన వేల్పుల రూబెన్ (55) కుటుంబానికి మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. మరణించిన వారి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు స్పందించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తక్షణమే మృతుడి భార్యకు అంత్యక్రియలకు నగదును ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మెన్ ముప్పవ పార్థసారథి, కాటూరి వెంకట నారాయణ బాబు(పెదబాబు), సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జి శ్రీనివాసులు, బండి అశోక్, భూమా సుమంత్, ధర్నాసి రామారావు, రబ్బానీ, ఏద్దు నగేష్, గ్రామస్థులు వేల్పుల దాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మిని స్టేడియంలో బిగ్ ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు

ప్రజాశక్తి ఒంగోలు సబర్బన్

వరల్డ్‌కప్‌లో ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌లో నేడు తలపడనున్నాయి. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రికెట్ ప్రియులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఆంధ్రక్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక స్టేడియం ఎన్నుకొని అక్కడ క్రికెట్‌ను ప్రజలు వీక్షించే విధంగా బిగ్ స్క్రిన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని మిని స్టేడియంలో బారీ ఎల్ఈడి బిగ్ స్క్రీన్‌ను క్రికెట్ వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రక్రికెట్ అసోషియేషన్ సభ్యులు, వైసిపి యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి సారధ్యంలో ఐదువేల మంది కూర్చొని బిగ్ స్క్రీన్‌పై క్రికెట్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి తన సొంత ఖర్చులతో క్రికెట్ అభిమానులకు స్నాక్స్, కూల్‌డ్రింక్స్, ఇతర వసతులు సమకూర్చారు. మిని స్టేడియంలో క్రికెట్ అభిమానుల కోసం ఏర్పాటు చేసిన వసతులను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలు శనివారం పరిశీలించారు. ఒక అంబులెన్స్ కూడా మినిస్టేడియం వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. ఒక పండుగ వాతావరణంలో క్రికెట్‌ను బిగ్ స్క్రీన్‌మీద చూసి ఆనందించాలని, ఇండియా ఈ మ్యాచ్‌లో విజయకేతనం ఎగుర వేయాలని బాలినేని శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి వెంట ఆంధ్రక్రికెట్ అసోషియేషన్ సభ్యులు మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, కార్పొరేటర్ జడా వెంకటేష్ ఉన్నారు.

21న సిటియు సమావేశం

ప్రజాశక్తి-కొండపి

ఈనెల 21న సిఐటియు సమావేశం కొండపిలో జరుగుతుందని సిఐటియు నాయకులు గడ్డం వందనం, అంగలకుర్తి కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమం 21న ఉదయం 10 గంటలకు కొండపి బస్‌స్టాండ్ పక్కనగుడి ఆవరణలో జరుగుతుందని, ముఖ్య అతిథిలుగా సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రామనికి అంగన్‌వాడీ, ఆశ, విద్యుత్, ఆటో, భవన నిర్మాణం తదితర రంగాల వారు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కళ్లజోళ్లు అందజేస్తున్న షాలేమురాజ్

వృద్ధులకు కళ్లజోళ్లు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు (వేమూరు)

వేమూరు మండలం చావలి గ్రామంలో గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేము రాజ్ సుమారు 106 మంది వృద్ధులకు కళ్లజోళ్లు అందజేశారు. ఇటీవల గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం 106 మందికి వైద్య చికిత్సలు అవసరమయినట్లు గుర్తించగా వారికి చికిత్సలు చేయించిన అనంతరం శనివారం ఈ కళ్లజోళ్లు అందజేసినట్లు షాలేమురాజు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఇప్పటికే ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని అన్నారు. వాటిలో అవసరమైన వారికి కూడా శస్త్ర చికిత్సలు చేశారని, వీరందరికీ త్వరలోనే కళ్లజోళ్లు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు, పలు రకాలుగా ఆపదలో ఉన్న వారిని నిరంతరం ఏదో రూపంలో ఆదుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఏపీ ఇన్‌ఛార్జి యన్నం సురేష్, నాని, సురేష్, ముసలయ్య, సాంబయ్య, అశోక్, మున్నేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులపై సత్వర చర్యలు: సీఐ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

సిఐ అక్కేశ్వరరావు

ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకుంటామని మార్టూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన పి అక్కేశ్వరరావు తెలిపారు. గుంటూరు పట్టణ వెస్ట్ ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న అక్కేశ్వరరావును సాధారణ బదీలలో భాగంగా గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ మార్టూరు సీఐగా నియమించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెదదోర్నాల, గిద్దలూరు, ఉలవపాడు వంటి పలు పోలీస్ స్టేషన్ లలో ఎస్ఐగా విధులు నిర్వహించి పదోన్నతిపై నెల్లూరు జిల్లాలో సీఐగా పనిచేశారు. అనంతరం గుంటూరు పట్టణ ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించారు. మార్టూరు సీఐగా విధులు నిర్వహించిన ఫిరోజ్‌ను అధికారులు సస్పెండ్ చేయడంతో అక్కేశ్వరరావును మార్టూరు సీఐగా బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన అక్కేశ్వరరావును మార్టూరు ఎస్ఐ ముసలం శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

బోధి ధర్మ తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-రేపల్లె

పతకాలు సాధించిన బాలలు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో బోధి ధర్మ తైక్వాండో క్రీడాకారులు ఆరు బంగారు, రెండు రజత పథకాలు సాధించారని కోచ్ కోకిలగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన స్టేర్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 14,15 తేదీలలో బోధి ధర్మ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో రేపల్లెలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా టీమ్ నుంచి బోధి ధర్మ తైక్వాండో క్రీడాకారులు పాల్గొని 6 బంగారు పతకాలు, 2 రజిత పతకాలు సాధించినట్లు తెలిపారు. చేతన్ చౌదరి, తులసి, దింపు సాయి, రిషి, ఆది, కార్తికేయ బంగారు పతకాలు తనూష, రామ్, రజిత పతకాలు సాధించారని తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు నవంబర్ 30 నుంచి న్యూఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ క్రీడాకారులను రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, వైసిపి యూత్ నాయుడు రాజీవ్, సీ ఫుడ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ బోలిశెట్టి రామకృష్ణ అభినందనలు తెలిపారు.

చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాటం

బీసీల కోసం రక్షణ చట్టం తేవాలి ● మంచి భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందాం ● మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కొనకండ్ల నారాయణ

ప్రజాశక్తి-బాపట్లజిల్లా

చట్టసభల్లో అన్ని కులాల సమాన ప్రాతినిధ్యం కోసం, బీసీలకు రాజ్యాధికారం కోసం, చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం బీసీలందరూ సమైక్యంగా పోరాట చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎంపీ కొనగళ్ల నారాయణ పిలుపునిచ్చారు. బీసీలకు ప్రభుత్వం చేసిన నమ్మకద్రోహంపై తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ బిసి సెల్ ఆధ్వర్యంలో బిసి కులాలు, ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీ బీసీ నేతలతో "ఐక్య పోరాట" (రౌండ్ టేబుల్) సమావేశం శనివారం బాపట్లలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సమావేశంలో కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో రాజకీయ చైతన్యం ఎక్కువ అన్నారు. జిల్లాలో గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో పలు సమస్యలపై బీసీలు ఐక్యంగా పోరాటం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అవినీతిలో, అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. జగన్ లాంటి వ్యక్తి సీఎంగా ఉండటం రాష్ట్రం చేసుకున్న దురదృష్టమని అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం మొత్తంగా బీసీలపై అనేక కేసుల అక్రమంగా పెట్టారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుపై కూడా కేసు నమోదు అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్టు చెబుతోందని, అయితే అది సక్రమంగా జరుగుతుందని నమ్మకం లేదన్నారు. టిడిపి కూడా కులాలకు అనుగుణంగా కేటాయింపులు జరగాలని కోరుతున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్రంగా కులగణన చేపట్టి తదనగుణంగా చట్టసభల్లో అన్ని కులాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు.

రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ బిసిలు 50 శాతం జనాభా ఉన్నా, రాజకీయంగా మనకు సరైన స్థానం లేదని అన్నారు. ప్రజా పరిపాలనలో మన భాగస్వామ్యం తగినంతగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఈ వైసిపి ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టి ప్రభుత్వాన్ని స్థాపించిందని, కానీ బీసీలకు చేసిన న్యాయం ఏమిటని ప్రశ్నించారు. న్యాయం మాట దేవుడెరుగు. అసలు ఈ రాష్ట్రంలో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని అన్నారు. 30కి పైగా సంక్షేమ పథకాలు ఈ ప్రభుత్వం అందకుండా చేస్తోందని పేర్కొన్నారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు మాట్లాడుతూ తాను బీసీల పక్షపాతిని అని చెప్పుకుంటూ తిరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల్లో 10శాతం రిజర్వేషన్ ఎత్తేశారని ధ్వజమెత్తారు. తద్వారా 16,800 పదవులను బీసీలకు దూరం చేశారన్నారు. బీసీ కార్పొరేషన్ నిధులు పక్కదారులు పట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిసి సబ్ ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లు తినేశారన్నారు.

తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ దామాషా పద్ధతిలో చూసుకుంటే 50 శాతం ఉన్న బీసీలకు అసెంబ్లీలో ఎన్ని స్థానాలు కల్పించాల్సి ఉంది కానీ ఈ వైసిపి ప్రభుత్వం చేసిందా అని ప్రశ్నించారు. ఒక కులమే మొత్తం రాజ్యాధికారాన్ని అందుకున్నారు. మరి మన బీసీల పరిస్థితి ఏంటని అన్నారు. జనసేన పార్టీ కోఆర్డినేటర్ నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం బీసీల ఓట్లే ముద్దు, బీసీలు వద్దు అనే ఒంటెత్తుపోకడతో వ్యవహరిస్తోందని అన్నారు. ఇప్పుడు మళ్లీ సామాజిక బస్సు యాత్రతో మరోసారి బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య మాట్లాడుతూ బీసీ ఓట్ల కోసం ఈ ప్రభుత్వం ఇంకో కొత్త నాటకానికి తెరలేపిందని, ఓబీసీ కుల జన గణన చేస్తామని అంటోందన్నారు. ఓబీసీ కుల జనగణన వెంటనే చేసి జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయించాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ కేవలం టిడిపి, జనసేన సమన్వయ ప్రభుత్వంతోనే సాధ్యమని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బాపట్ల మాజీ ఎంపీపీ తాతా జయప్రకాష్ నారాయణ, తమ్మిశెట్టి రమాదేవి, పలు బిసి సంఘాలు, అఖిలపక్ష సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై టీడీపీ, జనసేన ఆందోళన

'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' పేరుతో ఉమ్మడి కార్యక్రమం - రహదారులపై చిన్న చిన్న గోతులు కూడా పూడ్చలేని దుస్థితిలో ప్రభుత్వం

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

తెలుగుదేశం, జనసేన ఉమ్మడిగా 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' పేరుతో బల్లికురవ మండలం సూరేపల్లి గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. రహదారుల్లో చిన్న చిన్న గోతులను కూడా పూడ్చలేని దుస్థితిలో ఈ చేతకాని ప్రభుత్వం ఉందని నాయకులు ధ్వజమెత్తారు. రహదారుల దుస్థితిపై బల్లికురవ మండల టీడీపీ, జనసేన సంయుక్తంగా 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సూరేపల్లి రోడ్డులో ఉన్న గుంతల వద్ద నిరసన తెలిపారు. సైకో రాజ్యంలో రోడ్లు నాశనం అంటూ నినదించారు. టిడిపి హయాంలో గొట్టిపాటి రవికుమార్ సారధ్యంలో అద్దంకి నియోజకవర్గంలో బిటి రోడ్లు రూ.174 కోట్లతో 274 కి.మీ రోడ్లు వేశారని గుర్తు చేశారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో నాశనం చేశారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ప్రజలు గుంతల రాజ్యం చూడాల్సిన పరిస్థితి వచ్చిందని నేతలు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ఆయా పార్టీల నాయకులు

'విద్యాదీవెన'ను పాత పద్ధతిలోనే ఇవ్వాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో చదువుతున్న డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు జగనన్న విద్య, వసతి దీవెన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పద్ధతిలో కాకుండా పాత పద్ధతిలోనే విద్యార్థి తల్లి ఎకౌంట్లో వేయాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్మెంట్ స్థానంలో తీసుకొచ్చిన జగనన్న విద్య, వసతి దీవెన పథకం విద్యార్థుల అకౌంట్లో కాకుండా తల్లిదండ్రులు అకౌంట్లో వేస్తామంటూ మార్పులు చేశారు. సంవత్సరానికి నాలుగు విడతల వారీగా విద్యార్థి తల్లి అకౌంట్లో జగనన్న విద్యా దీవెన వేస్తోంది. ఈ సంవత్సరం దానిని కాస్తా మార్పు చేసి విద్యార్థి, తల్లితో జాయింట్ అకౌంట్ ఉంటేనే విద్యా దీవెన, వసతి దీవెన వేస్తామంటూ మార్పులు చేయడం సరైన నిర్ణయం కాదని అన్నారు. ఈ కారణంతో విద్యార్థులకు అకౌంట్లో డబ్బులు వేయకుండా చేసేందుకు ప్రణాళికలు వేసినట్టుగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ మూడు సంవత్సరాల కాలంలో అర్హత ఉండి విద్యార్థులు తల్లిదండ్రుల అకౌంట్లో విద్యా దీవేన, వసతి దీవెన పడని విద్యార్థులు చాలామంది ఉన్నారు. వాటిని సరిచేయకుండా మరల జాయింట్ అకౌంట్ లేదన్న సాకుతో విద్యార్థుల ఎకౌంట్లో డబ్బులు వేయకుండా ఉండే దానికోసం ప్రభుత్వం చేసే నిర్ణయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు గుర్తించాలని నాలుగు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికల వస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయం సరైన కాదని తక్షణం దీనిని విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హైమా నవీన్ రాకేష్ నాగార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మనోజ్ కుమార్

మాతాశిశు వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి
- కలెక్టర్‌తో కలిసి యాభై పడకల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాతా శిశువైద్యశాలలో ఆధునాతన పరికరాలతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మాతా శిశువైద్యశాలలో నూతనంగా రూ. కోటి డెబ్బై ఆరు లక్షలతో నూతనంగా నిర్మించిన యాభై పడకల భవనాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మాతా శిశువైద్యశాలలో పుట్టిన పిల్లలకు వైద్యం అందించేందుకు అధునాతన పరికరాలు సమకూర్చుకోవడం జరిగిందని, మంచి వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రయివేటు ఆసుపత్రులకు పోటీగా ఇక్కడ తగినంత మంది సిబ్బందితో వైద్యాన్ని అధునాతన పరికరాలతో అందిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన భవనానికి అనుసంధానంగా త్వరలో అప్రోచ్ సిమెంటు రోడ్డు కూడా నిర్మిస్తామని తెలిపారు. తరువాత ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒడా ఛైర్మన్ శింగరాజు మీనా కుమారి, పలువురు వైద్యులు, వైద్యఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

50 పడకల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రక్షణ కల్పిస్తే ఆధారాలు అందజేస్తా..

భూ ఆక్రమణలపై పోలీసులకు సుబ్బారావు గుప్తా విన్నపం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులో జరుగుతున్న నకిలీ స్టాంపులు, భూ కుంభకోణాలు, భూ ఆక్రమణలు, కబ్జాలపై వైసిపి రెబల్ నేత సుబ్బారావు గుప్తా ఇటీవల పాత్రికేయుల సమావేశంలో చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఇవ్వాలని ఈనెల 14వతేదిన తాలుకా పోలీసులు సుబ్బారావు గుప్తాకు 91సిఆర్‌పి నోటీసు జారి చేశారు. భూ ఆక్రమణలపై ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఇవ్వాలని ఆనోటీసులో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో సుబ్బారావు గుప్తా శనివారం తాలుకా పోలీసులకు ఓ విన్నపం చేశారు. ఆయన విన్నపాన్ని తాలుకా సిఐకి లిఖిత పూర్వకంగా అందజేశారు. తనకు తెలిసిన ఆధారాలు ఇవ్వాలంటే అందులో ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపార వేత్తలు, అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు ఉన్నారని, కాబట్టి తనకు లిఖిత పూర్వక అధికారిక ఉత్తర్వులు ద్వారా గన్‌మెన్లు, తన కుటుంబానికి రక్షణ ఇవ్వాలని ఆ విజ్ఞప్తిలో కోరారు. అప్పుడే తన వద్ద ఉన్న ఆధారాలు సమర్పించగలనని పేర్కొన్నారు. గతంలో తనపై దాడి జరిగిందని, రెండుసార్లు హత్యాయత్నం దాడి చేయడమే కాకుండా ఐదు కేసులు తనపై ఉద్దేశపూర్వకంగా బనాయించారని తెలిపారు. ఈవిషయాలన్ని గౌరవ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు దృష్టికి తాను తీసుకు వెళ్లడం జరిగిందని, వారి సహాయ సహకారాలతో త్వరలోనే ఒంగోలులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. సమావేశంలో అన్నీ రాజకీయ పార్టీల నేతలు పాల్గొంటారన్నారు. పోలీసులు కూడా బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని తీర్మానం

ప్రజాశక్తి-పిసిపల్లి

పిసిపల్లి మండలాన్ని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని, అన్ని గ్రామాలకు తాగునీరు, సాగు నీరు అందించాలని, పిసిపల్లి మండలాన్ని ఫ్లోరిన్ రహిత మండలంగా మార్చేందుకు మండలాన్ని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని మురుగమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్, పిసిపల్లి మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని మిగతా ఎంపిటిసిలు ఏకగ్రీవంగా ఆమోదించి బలపరిచారు. ఈ తీర్మానాన్ని జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రులకు పంపనున్నట్లు ఎంపిడిఓ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి వెలుగొండ ప్రాజెక్టు ఏకైక పరిష్కారమని తీర్మానం చేశారు. మండలంలో వర్షం తక్కువగా ఉందని, వేసిన పైర్లు కూడా వాడిపోతున్నాయని, అందు వలన పిసిపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణం చేసింది. పిసిపల్లి మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి అత్తూల జషన్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సచివాలయాల్లో సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని సొసైటి అధ్యక్షులు పోలు జయరామిరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి లక్ష్మీకాంతం ఒకేరెడ్డి, ఎంపిటిసిలు చెరుకూరి సతీష్, భూమిరెడ్డి కొండారెడ్డి, మైలా రవణమ్మ, సిహెచ్.స్వప్న, మూలె సీత, డిప్యూటి తహశీల్దార్ ఎం.శ్రీనివాసులు, ఎంఇఓ-1 జి.సంజీవ్, ఎంఇఓ-2 శ్రీనివాసులు, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రాజ్యలక్ష్మీ, ఎఇలు రాజేష్, తిరుపాలయ్య, రామక్రిష్ణారెడ్డి, అటవీశాఖ నుండి సునీల్, ఐకెపి, ఎఓ జి.వెంకటస్వామి, ఎపిఎం సత్యానందం, డిప్యూటి తహశీల్దార్ ఎం.శ్రీనివాసులు, ఎపిఓ సుబ్బారావు, ఐసిడిఎస్ జరీనా, ఉద్యానవనశాఖ కుసుమ, పంచాయితీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు వెంకటరావు, మల్లికార్జున, తిరుపతిరావు, మరియమ్మ, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ కరీం పాల్గొన్నారు.



తీర్మాణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని జివిఎల్‌పురం-రామచంద్రాపురం మధ్యగల బ్రిడ్జి నిర్మాణానికి ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు భూమిపూజ నిర్వహించారు. ఎన్నో ఏళ్ళుగా రాకపోకలకు సమస్యగా ఉన్న చప్టా స్థానంలో బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి మండల పరిషత్ నుంచి రు.50లక్షలను కేటాయించారు. ఈనేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, తిరుపతిస్వామి, సొసైటి అధ్యక్షులు మల్లికార్జునరావు, సుంకర శ్రీనివాసరావు, కత్తి రమణారెడ్డి, మన్నం వెంకటరావు, బాలాజీ, నల్లూరి చంద్రారావు, శివన్నారాయణ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణకు హాజరైన మేయర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గుంటూరులోని ఎపిహెచ్ఆర్‌డిఐ రెషిడెన్సీలో గత మూడురోజులుగా జరుగుతున్న స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, నగరానికి చెందిన పలువురు కార్పొరేటర్లు శనివారం పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల నుంచి మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, కార్పొరేటర్లు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అశోక్‌కుమార్‌రెడ్డి

'అశోక్' కార్యాలయం ప్రారంభం...

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త మాజీ పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఈ కార్యాలయాన్ని డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి ఆసుపత్రి వద్ద ప్రారంభించారు. అనంతరం లోపల ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కట్ట శోభారాణి, వైస్ ఎంపీపీ షేక్ షకీలా, రాష్ట్ర వడ్డెర డైరెక్టర్ యనమల మాధవి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాపూరి ప్రభావతి, శీలం రాము, చుక్క కిరణ్ కుమార్, చొప్పర వెంకన్న, రమణారెడ్డి, కుంచాల రవి, కొక్కిలిగడ్డ హనుమంతరావు ఇతర వైసీపీ నాయకులు.

రహదారిపై నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు

అధ్వాన స్థితిలో రహదారులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయని మండల టీడీపీ అధ్యక్షులు బి.వెంగయ్య తెలిపారు. రహదారుల అధ్వాన్న స్థితిపై టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గుంతల రోడ్ల వద్ద నిలబడి నిరసన తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రహదారులు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట చిన్న, జనసేన మండల అధ్యక్షులు జానపాటి రాజు, టీడీపీ నాయకులు రామకష్ణమారాజు, పి.నరసయ్య, కె.వెంకటకొండయ్య, మహబూబ్బాషా, వెంకటరామయ్య, కువ్వారపు యాకోబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

సిఎస్.పురం: మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని బిసి బాలికల వసతి గృహంలో చదువుతున్న బాలికలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన దుప్పట్లను కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బుజ్జి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ టి.బాబురావు, హాస్టల్‌వార్డెన్ లక్ష్మీదేవి, టీచర్లు అహమ్మద్ శ్రీను పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు యర్రగొండపాలెంలోని త్రిపురాంతకం రోడ్డులో ఉన్న గుంతల రోడ్డు వద్ద టిడిపి నాయకులు ప్లే కార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు అన్ని గుంతలమయం అయ్యాయని తెలిపారు. గోతులలో వాహనాలు పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. యర్రగొండపాలెం త్రిపురాంతకం డబుల్ రోడ్డు వేస్తానని మంత్రి సురేష్ హామీ ఇచ్చి మర్చిపోయారని గుర్తుచేశారు. టిడిపి నాయకులు ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం గుంతల రాజ్యం గోతుల రాజ్యం అంటూ ప్లే కార్డులతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, శనగా నారాయణరెడ్డి, తోట మహేష్ నాయుడు, షేక్ వలి, షేక్ ఇస్మాయిల్, వేగినాటి శ్రీను, కాకర్ల కోటయ్య, కొత్తమాసు సుబ్రమణ్యం, మంత్రూ నాయక్, భాస్కర్, చెవుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

నీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో శనివారం నీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. గ్రామంలో ఒకే బోరు పని చేస్తుందన్నారు. అది కూడా గుతుకుతూ వస్తున్నాయన్నారు. దీంతో పొలాలకు వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. విషయం అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్లు వేయడం కానీ, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం కానీ చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-పిసిపల్లి

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని కరిగిరి ఆర్‌డిఓ పి.జాన్‌ఇర్విన్ అన్నారు. శనివారం ఆయన తహశీల్దార్‌తో కలిసి ఓటర్ల జాబితాలో వచ్చిన ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. మరణించిన వారి ఓటర్లను తొలగించాలని తెలిపారు. గతంలో ఎన్నికల జాబితాల్లో జరిగిన పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఫిర్యాదు చేసిన వారిపై పున:పరిశీలన చేసి తుదిజాబితాను విడుదల చేస్తామన్నారు. పిసిపల్లి మండలంలో ఇద్దరు, ముగ్గురు బిఎల్‌ఓలు నిర్లక్ష్యంగా ఉన్నారని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట తహశీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, డిపి కె.ధర్మతేజ, ఆర్‌డిఓ కార్యాలయ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాలలోని భ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ, వసంత జూనియర్ కళాశాలలో శనివారం వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు తనను తాను తెలుసుకొని మంచి విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను వెళ్లాలని తరగతి గదులు తరగని గనులని పాలమూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు రాధా కృష్ణారావు అన్నారు. అనంతరం విద్యార్థులకు మెటీరియల్స్, చెక్కులను పంపిణీ చేశారు.

మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బిళ్లగొందిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల బిళ్లగొంది, గౌతమ బుద్ధుని కాలనీ, పుల్లయ్య కుంట, యల్లారెడ్డిపల్లి చెంచు గూడెంలో వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వి కోటా నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆ గూడేల్లో విష జ్వరాలు ప్రబలడంతో గిరిజనులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్తపూతలు తీశారు. సెలైన్లు పెట్టారు. మందులు పంపిణీ చేశారు. అలాగే రక్తహీనతతో బాధ పడే రోగులకు ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు అందజేశారు. గర్భిణీలు, చిన్నారులకు టీకాలు వేశారు. దోమలు కట్టకుండా దోమ తెరలు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగలక్ష్మి, రమణమ్మ, శ్రావణి, లక్ష్మిదేవి, అంకమ్మ, గురవమ్మ, నలగాటి వెంకట్రామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ మస్తాన్‌నాయక్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే విద్యార్థి పూర్తి సమాచారం, పాఠశాల స్థితిగతులు, పాఠశాల అవసరాలు గుర్తించి మండల విద్యా శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అలాగే ఎస్ఎంసి గ్రాంట్ పడిన పాఠశాలలు పాఠశాలకు అవసరమైన పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 కొండలరావు, కాంప్లెక్స్ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఫ్లోరోసిస్ వ్యాధి గ్రస్తులను గుర్తించడం, త్రాగు నీటిలో ఫ్లోరిన్ శాతాన్ని పరిశీలించుటలో భాగంగా శనివారం దూపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను పరీక్షించారు. పళ్ళ, వంకర కాళ్ళు పరీక్షించి వ్యాధిపై అవగాహన కలిగించారు. పోషకాహారం, ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వి అనిల్, దూపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లక్ష్మిదేవి, రమేష్, సూపర్ వైజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

దొనకొండ : స్థానిక వివేకానంద పాఠశాల ఆవరణలో దొనకొండ అభయ్ హస్పిటల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి తెలిపారు. గుంటూరు జిల్లా పెద్దకాకానిలోని శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్యబృందం పాల్గొని వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. మండలంలోని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు.

సమస్యలపై ధ్వజమెత్తిన ప్రజా ప్రతినిధులు

ఉపాధి నిధుల తీర్మానంపై రసాభాస

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

మండలంలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు శనివారం ఎంపిపి నలమలపు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు సభదృష్టికి తీసుకువచ్చిన పరిష్కారం కావడం లేదని ధ్వజమెత్తారు వినోదరాయిని పాలెం లో పలుమార్లు చెప్పినప్పటికీ పరిష్కారం కావడం లేదని సర్పంచ్ ఘట్టమనేని అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. చీర్వానుప్పలపాడు ఎంపిటిసి పొద పవన్ మాట్లాడుతూ త్రాగునీరు సరపరా చేయడానికి విద్యుత్ సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపిటిసి మున్నంగి వెంకట్రావు మాట్లాడుతూ ఉప్పుగుండూరు దక్షిణం బజారులో జలజీవన్ క్రింద కొత్తలైన్లతో అసలు నీరురావడం లేదని ప్రశ్నించారు. చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్ మాట్లాడుతూ మాగ్రామానికి గత నాలుగు సంవత్సరాల నుండి త్రాగునీరు రావడంలేదని పలుమార్లు మండల ఆర్ డబ్ల్యు ఎస్ అధికారి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రీసర్వేతో హద్దురాళ్ళు ఏర్పాటు చేయడంలో తప్పిదాలు జరగడంతో గ్రామంలో రైతుల మధ్య వివాదాలు చోటు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

చేసుకుంటున్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. తహశీల్దార్ సుజన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో భూమాలకు సంబంధించి రీసర్వే జరుగుతుందని రైతులు ఏమైన తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు కొనుగోలు జరిగిన ఆన్ లైన్ సమస్యలు సరిచేయించుకోవాలన్నారు రీసర్వే పూర్తిఅయితే సరిచేయడం కుదరదన్నారు అనంతరం శాఖలవారిగా సమీక్ష నిర్వహించారు

ఉపాది నిధులపై రసా భాస : మండలంలో ఉపాది హామీపధకం క్రింద సిసిరోడ్లకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులకు సంబంధించి ప్రతి గ్రామానికి రూ.5లక్షలు చొప్పున మంజూరు చేసి తీర్మానం చేసి పంపగా ఆతీర్మానం మారడంతో సమావేశం రసాభాసాగా మారింది. ఆతీర్మానం మండల బాడీతీర్మానం కాకుండా మాచవరం రూ.20లక్షలు, అమ్మనబ్రోలుకు, ఉప్పుగుండూరుకు ఒక్కొక్క ఊరికి రూ.10లక్షలు, కనపర్తి, కొత్తకోట, ఒమ్మెవరం, చీర్వానుప్పలపాడు గ్రామాలకు రూ.5లక్షల చొప్పున మంజూరు చేసి ఎంపిపి సంతకం కోసం ఫైలు పెట్టగా ఇదేమిటి కొన్ని గ్రామాలకు పెట్టడమేమిటని ఎంపిపి అంజమ్మ ఎంపిడిఓను ప్రశ్నించారు. దాంతో ఎంఎల్ఏ చెప్పినట్టు చేసానని తెలిపారు. అదేమిటి బాడీతీర్మానం ప్రకారం చేయాలి కదా ఎంఎల్ఏ చెప్పినట్లు చేయడమేమిటని మాతో చర్చించాలి కదా అని సభ్యులందరు ఒక్కసారిగా ప్రశ్నించడంతో సభ రసాభాసాగా మారింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుజన్ కుమార్, ఎంపిడిఓ జయమణి, వివిధ గ్రామాల ఎంపిటిసిలు ,సర్పంచ్‌లు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సొసైటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నాగపద్మజారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని తద్వారా శారీరక ధారుడ్యాన్ని కలిగి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తదనంతరం సీనియర్, జూనియర్ విభాగ విద్యార్థులకు పరుగు పందెం, కుర్చీలాట పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 300 మంది విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొనడం విశేషం. మధ్యాహ్నం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సీనియర్ జూనియర్ విభాగంలో గ్రంథాలయ ఆవశ్యకతలి అనే అంశం మీద వ్యాసరచన, వకత్వ పోటీలను జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోధ్యాయురాలు విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, ఆటల పోటీల కార్యక్రమంలో జడ్‌పిహెచ్ ఎస్ పిడి సుశీల, ప్రభుత్వ

కనిగిరి బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

ఉన్నత పాఠశాల పిడి సుమన్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 20వ తేదీన జరుగు ముగింపు వేడుకల సభ నందు ప్రముఖుల చేత బహుమతి ప్రదానం చేయబడునని గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ తెలియచేశారు. **కొండపి :** ప్రతి విద్యార్థి చదువుతోపాటు... క్రీడలలో కూడా రాణించాలని ఎంఇఒ-2 రామారావు విద్యార్థులకు సూచించారు. శనివారం కొండపి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా 5వరోజు నాలుగు పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఇఒ-2 ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఇందులో బాగంగా కుర్చీలాట, పాటలపోటీలు, పరుగుపందెం, చిత్రలేఖనవంటి పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసిరెడ్డిపాలెం, కుమ్మరిపాలెం, ఇంకా రెండు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, సుబ్బారావు, శాంతి, కళ్యాణి ఉపాధ్యాయులు తిరుపతి స్వామి, ఈ పోటీలకు 60 మంది విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదిత్య ఒకేషనల్ కళాశాల, నలంద హైస్కూల్, వికాస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి ఆంజనేయులు, గ్రంథపాలకురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

బతిమిలాడినా హాజరు కాని ప్రజాప్రతినిధులు

-ప్రారంభం కాని మండల సమావేశం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం నాడు జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో సమావేశం ఒంటిగంట అయిన ప్రారంభమం కాలేదు. ప్రజాప్రతినిధుల కోసం ఎంపిడిఓ ఫోన్‌లో ప్రజాప్రతినిధులను బ్రతిమలాడినప్పటికీ ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో సమావేశ మందిరంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. గ్రామాలలో ఏ సమస్యను పరిష్కరించకపోవడంతో ఈ నామమాత్రపు సమావేశాలు ఎందుకు అంటూ ప్రజాప్రతినిదులు సమావేశానికి తిరస్కరించినట్టు తెలిసింది. అధికారులు సైతం కొన్ని శాఖ అధికారులు మాత్రమే నామమాత్రంగా హాజరు అయ్యి వెళ్లిపోయారు. దీంతో ఎంపిడిఓ తనకు తెలిసిన వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ప్రత్యేకంగా ఫోన్ ద్వారా పిలిపించుకొని ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశానికి హాజరు అయ్యినట్లుగా సమావేశ పుస్తకంలో సంతకాలు చేయించుకొని పంపించి వేశారు. ఇంత పేలవంగా మండల సమావేశం నిర్వహించే ఎంపిడిఓ మండల సమస్యలపై ఏ మాత్రం స్పందిస్తారో ఇట్టే అర్థం అవుతుందని ప్రజలు బహిరంగంగా

సమావేశానికి హాజరు కాని అధికారులు

చర్చించుకుంటున్నారు. ప్రజా సమస్యలపై చర్చించి నిర్ణయించుకోవాల్సిన ఇలాంటి సమావేశాలను అధికారులు అపహస్యంగా నిర్వహించడంపై జిల్లా అధికారులు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. పలుపుర ప్రజాప్రతినిదులను మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడానికి కారణం ఏమిటి అనేది విచారించగా సమస్యలు అధికారులు దృష్టికి తీసుకొని వచ్చిన పరిష్కారానికి అధికారులు స్పందించడం లేదని అందువలనే తాము మండల సమావేశానికి తిరస్కరించడం జరిగిందన్నారు. ఇదే విదంగా గత నాలుగు ధపాలుగా సమావేశాలు జరిగినప్పటికి గ్రామాలలో ఎటువంటి సమస్యలు నెరవేరకపోవడంతో సమావేశానికి మానుకోవడం జరిగిందని తెలిపారు.

రోడ్ల గుంతలు పూడ్చలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-కనిగిరి

రోడ్లకు పడ్డ గుంతలు పూడ్చలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని తెలుగు యువత నాయకులు షేక్ ఫిరోజ్, జనసేన మండల అధ్యక్షులు రమేష్‌లు అన్నారు. గుంతల కనిగిరికి దారేది, గుంతల ఆంధ్ర ప్రదేశ్‌కు దారేది అంటూ ఫ్ల కార్డులు చేతబట్టి టిడిపి జనసేన శ్రేణులు కనిగిరిలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలో పలుచోట్ల రోడ్లకు పడ్డ గుంతల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నిరసన బైక్ ర్యాలీ నిర్వహించారు. సంక్షేమం పేరుతో సంక్షోభ పాలన సాగిస్తున్నారని, అభివద్ధి జాడలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు వీవీఆర్ మనోహర్ రావు, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ అహ్మద్, చింతలపూడి తిరుపాలు, ఈదర రవికుమార్, ఆర్ వి నారాయణ, పాలూరి సత్యం, బుల్ల బాల బాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ఘనంగా వారోత్సవాలు

ప్రజాశక్తి-రేపల్లె

విద్యార్థులు అనునిత్యం గ్రంథాలయాలను వినియోగించుకుంటూ తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్థానిక డిబిఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. స్థానిక మోటూరి రామారావు శాఖా గ్రంథాలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొని తమదైన శైలిలో చిత్రాలను తీర్చిదిద్దారు. అనంతరం మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ గ్రంథాలయంలో సభ్యులుగా చేరి పుస్తకాలను నిత్యం చదువుకోవడం ద్వారా అనేక విజ్ఞానవంతమైన విషయాలను తెలుసుకోవాలని సూచించారు. ఖలీలుల్లా, నాగరాజు, గ్రంథాలయ అధికారి సుభాష్ చంద్రబోస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపట్ల: విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంచేందుకు చిత్రలేఖనం వంటి పోటీలు విద్యార్థులకు అంతగానో దోహదపడతాయని ప్రముఖ చిత్రకారుడు, బధిరుల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు జి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాపట్ల శాఖ గ్రంథాలయంలో పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించే అనేక పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని అన్నారు. పోటీలను గ్రంథాలయ పాలకుడు ఏ శివాజీ గణేషన్ నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణీతగా చిత్రలేఖకుడు జీవి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మాటూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

రేపల్లెలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులు వివిధ రంగులతో వేసిన చిత్రాలను ప్రదర్శింపజేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఖలీలుల్లా, నాగరాజు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాల్లోకి వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కలపాలా సుభాష్ చంద్రబోస్ ఉన్నారు.

అద్దంకి: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా అద్దంకి శాఖ గ్రంథాలయ పరిధిలో శనివారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కటాక్షం బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు, భాష్యం హైస్కూల్ విద్యార్థులు, రవీంద్ర భారతి, అప్పర్ ప్రైమరీ ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులు, భాష్యం హైస్కూల్ విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చక్రాయపాలెం విద్యార్థులు 207 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిజాంపట్నం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎన్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచంలోని ఎన్నో గొప్ప విషయాలను తెలుసుకునేందుకు, నేర్చుకునేందుకు పుస్తక పఠనంకై గ్రంథాలయాలు ఎంతో దోహద పడుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివినప్పుడే విజ్ఞానం పెంపొందుతుందని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలలో విద్యార్థులు, యువత, పాఠకులు పాల్గొనాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ కమిటీ మెంబర్స్ కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బడుగు ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లూరు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం కొల్లూరులో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొల్లూరు సబ్ రిజిస్ట్రార్ షేక్ పర్వీన్ బాబి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు క్రమం తప్పకుండా వచ్చి పుస్తకాలను చదువుకోవడం వలన వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని ఆమె పేర్కొన్నారు. తదుపరి సబ్ జూనియర్స్‌కు వారికి నచ్చిన బొమ్మలు, జూనియర్స్‌కు ప్రకృతి దృశ్యం, సీనియర్స్‌కు పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కొల్లూరు సబ్ రిజిస్ట్రార్ సీనియర్ అసిస్టెంట్ కుసుమ, గ్రంథాలయ అధికారి వై రాంబాబు, ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు డేవిడ్ వీటిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అనంతవరం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నిర్మల హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి జి కనకదుర్గ అధ్యక్షత వహించారు.

సంతమాగులూరు: విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాన్ని సందర్శించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగించారు. ఇందులో భాగంగా 5వ రోజు విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా ఇంగ్లీషు లెక్చరర్ ఎండి అల్తాఫ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలి

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి-భట్టిప్రోలు (అమృతలూరు)

అమృతలూరు మండలం గోవాడ గ్రామంలో శనివారం బాబు షూ్యరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి బాబు షూ్యరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆనందబాబు మాట్లాడుతూ ఏపీలో వైసిపి పూర్తిగా అవినీతి అక్రమాలకు చెరలేపిందని దీనిని అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు వారికున్న ఓటును ఆయుధంగా వినియోగించాల్సి ఉందన్నారు. వేమూరు నియోజకవర్గంలో కూడా భూకబ్జాలు, ఇసుక మాఫియాతో దోపిడీ తీవ్రమైందని అన్నారు. గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఎక్కడా అభివృద్ధి లేకపోగా లక్షల కోట్ల ప్రజాధనాన్ని మాత్రం దోచుకుతిన్నారని వివరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు ఈ ప్రభుత్వ పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందని, దీని నుంచి రాష్ట్రం బయటపడటానికి తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను క్లస్టర్ ఇన్‌ఛార్జిలో యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు ఇంటింటికి తిరిగి కరపత్రాల రూపంలో ప్రజలకు అందజేసి అవగాహన కల్పించాలని కోరారు. ఈ మేరకు బాబు షూ్యరిటీ భవిష్యత్తు గ్యారెంటీ రిజిస్ట్రేషన్ చేయించి ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల: రాష్ట్రంలో మద్య నిషేధానికి తూట్లు పొడిచిన జగన్మోహన్ రెడ్డి మహిళల మద్యం బారిన పడి అల్లాడుతున్న కుటుంబాల్లో మహిళల కన్నీటికి కొట్టుకుపోతారని బాపట్ల

మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శనివారం తెలుగుదేశం జనసేన పార్టీలో సంయుక్తంగా బాబు షూ్యరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ ఇంటింటి తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని బాపట్ల ఆరో వార్డులో జనసేన, టిడిపి నాయకులు నిర్వహించారు. తెలుగుదేశం విధానాలను తెలియజేసే పుస్తకం, ప్రతి మహిళకు ఒక చీరను నరేంద్రవర్మ అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర ప్రజలను ద్రోహం చేస్తూ అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. అందులో భాగంగా మద్య నిషేధానికి తూట్లు పొడిచి పేద మధ్యతరగతి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారన్నారు. మద్యపాన నిషేధం అమలు చేయకపోవడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా మానసికంగా, సామాజికంగా సర్వనాశనమయ్యాయన్నారు. ఎన్నో కుటుంబాలు నిట్టనిలువునా కూలిపోయాయని అన్నారు. మహిళలు పడుతున్న మనోవేదన జగన్మోహన్‌రెడ్డిని సర్వనాశనమైపోతారని మహిళలు తిట్టిపోస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో టిడిపి, జనసేన కలిసి ప్రయాణం చేస్తున్న ఈ ఎన్నికల్లో తిరిగి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని నరేంద్రవర్మ కోరారు. మహిళా సంక్షేమం టిడిపితోనే సాధ్యమవుతుందని జనసేన, టిడిపి నాయకుల ఇంటింటి ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు నామన వెంకట శివనారాయణ, టిడిపి నాయకుల సలగల రాజశేఖర్ బాబు, శ్రీనివాసరావు, తాతా జయప్రకాష్ నారాయణ, పల్లం సరోజిని, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు, ఐలవరంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం బాబు షూ్యరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన మేనిఫెస్టోను రాష్ట్ర ప్రజల భవిష్యత్తును నెరవేరుస్తుందని నాయకులు పేర్కొన్నారు. అలాగే వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న నష్టాలు, పార్టీ చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం ముమ్మరం చేశారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో అవినీతి అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. పేద ప్రజలు పలు రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, సంక్షేమ పథకాలు ఒక్కటే అభివృద్ధి కాదని నాయకులు మాచర్ల నాగరాజు, ఎడ్ల జయాసిలరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖమ్మం సుధీర్, సయ్యద్ సిరాజుద్దీన్, దీపాల ప్రసాద్, జగ్గారపు పాపారావు, శుద్ధపల్లి నాగార్జున తదితరులు ఉన్నారు.

సీఐ రమేష్‌బాబుకు ఫిర్యాదు అందజేస్తున్న మృతురాలి బంధువులు

సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అద్దంకి

గత నెల 30వ తేదీన శీలం మెర్సీరాణి అద్దంకిలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో మొదటి కాన్పు కష్టమై మరణించారు. ఆమె మరణానికి ఆ వైద్యశాలలోని సిబ్బంది అలసత్వమేనని కారణమని బంధువులు ఆరోపించారు. డ్యూటీ వైద్యురాలు వాహిలా చౌదరి కాన్పు సమయంలో ఆసుపత్రిలో లేకపోవడంతో సరైన అవగాహన లేని నర్సులు కాన్పు చేయడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. కాబట్టి వైద్యురాలు లేకుండా కాన్పు చేసిన నర్సులను, వారికి ఆదేశాలు ఇచ్చిన వైద్యురాలు వాహిలా చౌదరిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సంఘటనపై తగిన దర్యాప్తు చేయాలని, మెర్సీరాణి శవానికి పంచనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అద్దంకి స్టేషన్ హౌస్ ఆఫీసర్ రమేష్‌బాబుకు, ఎస్ఐ వెంకటేశ్వర్లుకు మెర్సీరాణి తండ్రి శీలం చంద్రశేఖర్, పెద్దనాన్న శీలం రవికుమార్, దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు అందజేశారు.

యాంత్రీకరణతో అధిక ఫలితాలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

వ్యవసాయం యాంత్రీకరణతో అధిక ఫలితాలు పొందవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. శనివారం బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలో అఖిల భారత వరి పరిశోధనా సంస్థ నుంచి డాక్టర్ సిఎన్ నీరజ, సురేఖ, బి శ్రీదేవి, శైలజ, నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ ప్రభు కార్తికేయన్ బాపట్ల వరి పరిశోధన కేంద్రం నుంచి డాక్టర్ కృష్ణవేణి ప్రాణధార వరి వ్యవసాయ యాంత్రీకరణ చేసిన క్షేత్రాన్ని సందర్శించారు. గ్రామంలోని ప్రాణధార సెంట్రల్ వర్క్ షాప్‌లో ఉన్న వరి పంటకు వినియోగించే యంత్రం అది పని చేసే విధానం చూసి భవిష్యత్తులో సుస్థిర వరి వ్యవసాయం చేయాలంటే యాంత్రీకరణను ఉపయోగించాలని తెలిపారు. ప్రాణాధార సంస్థ వరి యాంత్రీకరణ అమలు చేసే విధానాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కుర్ర పుండరీకాక్షుడు, రైతులు నూతలపాటి బాబు, పువ్వాడ బసంత్ కుమార్, మెట్ల కోటేశ్వరావు పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-అమర్తలూరు (చెరుకుపల్లి)

డెల్టా ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అమర్తలూర మండల పరిధిలోని మోపర్రు రెవెన్యూ గ్రామంలో శనివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఎంపిక చేసిన కొడాలి పద్మావతి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన పంట దిగుబడి అంచనాలో సుమారుగా 33 బస్తాల దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉయ్యూరు లోకేశ్వరి తెలిపారు. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన పంటకోత ప్రయోగంలో 18.770 కిలోల దిగుబడి వచ్చిందని, దిగుబడి సుమారు 33 బస్తాలు అంచనాగా నిర్ధారించామని బాపట్ల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ లక్ష్మి తెలిపారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని ఆమె తెలిపారు. పంటకోత ప్రయోగం నిర్వహించిన వ్యవసాయ క్షేత్రం వెద పద్ధతిలో సాగుచేసినదని వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలో 2022-23 సంవత్సరానికి ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ బృందం ఈ నెల 19వ తేదీ పత్తేపురం గ్రామ సచివాలయ పరిధి నుంచి, 29వ తేదీ కొప్పరం గ్రామ సచివాలయంతో గ్రామసభలు ముగుస్తాయని ఇన్‌ఛార్జి ఎపిఒ బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఆయా తేదీలలో గ్రామ పంచాయతీలను సందర్శించి తనిఖీ చేసేందుకు, పనులు జరిగిన విధానాన్ని గ్రామసభ, మండల సభల ద్వారా తెలియజేస్తామని ఆయన వెల్లడించారు.

వీడని చిక్కుముడి

భూకుంభకోణాల చిక్కుముడి వీడలేదు. రోజురోజుకూ కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయి. కబ్జాలతో ఒంగోలు పట్టణం కలవరం రేపుతోంది. ఇప్పుడు అందరిచూపూ ఒంగోలువైపే ఉంది. ఏం జరుగుతుందనే చర్చ సర్వత్రా సాగుతోంది. నెల రోజులకుపైగా సిట్ దర్యాప్తు చేస్తున్నా భూకబ్జాలపై ఇంకా స్పష్టత రాలేదు. వీటిని అరికట్టే చర్యలు పూజ్యమయ్యాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించినా ఫలితం పెద్దగా కనిపించడం లేదు. మరో వైపు కబ్జాలపై రాజకీయ దుమారం రేగుతోంది. పాలకపక్షం ఇరకాటంలో పడింది. ప్రతిపక్షం ఆరోపణలు గుప్పిస్తోంది. ఎన్నికల సమయంలో ఒంగోలులో ఇప్పుడు భూకబ్జాల వ్యవహారం రాజకీయంగానూ వేడిని పెంచుతోంది. ఫిర్యాదులు కోకొల్లలుగా వస్తున్నాయి. వాటిని పరిశీలించి నిందితులను అరెస్టు చేస్తున్నారు. మళ్లీ కొత్త ఫిర్యాదులూ అదే స్థాయిలో వస్తున్నాయి. పోలీసులకు నిత్యం ఇదే పెద్ద ఎజెండాగా మారింది. శాంతిభద్రతల కన్నా భూకబ్జా కేసులపైనే పోలీసుల దృష్టంతా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పట వరకూ అరెస్టు కాబడ్డ వారంతా నామమాత్రపు వ్యక్తులేనన్న చర్చ సాగుతోంది. కీలక నిందితులను వదిలేశారనే విమర్శలు లేకపోలేదు. రాజకీయ ఒత్తిళ్లా లేక మరేమైనా కారణాలున్నాయా? అనేదీ స్పష్టత లేదు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం నిందితులను వదిలిపెట్టొద్దంటూ పలుసార్లు హెచ్చరికలు చేశారు. వీటి ప్రభావం ఎంతనేదీ చూడాలి. తెరచాటున ఉన్న ఘరానా మోసగాళ్ల జోలికి పోలీసులు వెళ్లడం లేదనే చర్చ మాత్రం ఉంది. పాలకపక్ష నేతల పాత్ర ఇందులో కీలకంగా మారింది. భూములకు సంబంధం లేని వ్యక్తులతో జీపీఏలు సృష్టించి వాటిని కాజేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ వ్యవహారంలో మేయర్ అన్ని విధాలా ఇరుక్కొని బయటపడ్డారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులూ అనేక కేసుల్లో ఉన్నారు. వీళ్లపై ఫిర్యాదులు వచ్చినా కేసులు నమోదు కావడం లేదు. ఇక్కడే ఫిర్యాదుదారులకు అనుమానం కలుగుతోంది. బినామీలను మాత్రం అరెస్టు చేసేస్తున్నారు. తెరచాటున వ్యవహారాలు నడిపిన కీలక వ్యక్తులను ఏమీ చేయలేకపోతున్నారు. ఏదేమైనా ఒంగోలు పట్టణంలో ఇప్పుడు భూబాగోతాలు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. నకిలీపత్రాలతో వందల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. అవన్నీ వివాదాలుగా మారాయి. నకిలీ జీపీఏలు పుట్టించారు. కబ్జాలు దర్జాగా సాగిపోతున్నాయి. భూములకు రక్షణ ఎండమావిగా మారింది. వీటన్నింటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే పెద్ద తప్పిదం కనిపిస్తోంది. అక్కడ ఇప్పటికీ దర్యాప్తు లేదు. అక్కడ నుంచే కబ్జాలకు పునాదులు పడ్డాయి. ముందు వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఎటువంటి పత్రాలను పరిశీలించకుండా ముందస్తు పథకం ప్రకారం అనేక అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటికి బాధ్యులు ఎవరన్నది తేలాల్సి ఉంది.



రబీలోనూ కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పొగాకు నాట్లు వేస్తున్నారు. నీటి కోసం పడే పాట్లు చెప్పేవి కావు. ఇతర పంటలు సాగు పెద్దగా లేదు. ఇటీవల అరకొర జల్లులు కురిశాయి. పశ్చిమాన మిర్చి సాగు చేశారు. బోర్లలోనూ నీరు లేక ఎండుతున్నాయి. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల పరిస్థితి ఆశాజనకంగా లేదు. గతంలోనే వ్యవసాయ శాఖ నివేదిక పంపింది. తాజాగా రబీకి నీరు ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రబీలో ఆరుతడి పంటలకు నీటి సమస్య తప్పడం లేదు. అంటే ఆరుతడితో ముడిపడి ఉన్న పంటలను మానుకోవాల్సిందే.. ఇప్పటికే 1.80 లక్షల ఎకరాల్లో మాగాణికి విరామం ప్రకటించారు. తాజాగా ఆరు తడి పంటలకు నీరు లేదంటే 2.50 లక్షల సాగర్ ఆయకట్టులోనే సాగు చేసే పంటలపై సందిగ్ధం ఏర్పడింది. అంటే ఈ విస్తీర్ణంలో ఏ పంటలు వేయాలన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్న.

జిల్లాలో కొత్త రాజకీయ కలయిక కొనసాగుతోంది. తెలుగుదేశం- జనసేన సంయుక్తంగా సమావేశాలు పెడుతున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో జరిగాయి. ఉమ్మడి మేనిఫెస్టోలను విడుదల చేస్తున్నారు. ఈ కూటమి లక్ష్యం ఒక్కటే. ఎన్నికల్లో వైసిపిని ఓడించాలన్నదే.. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తెలుగుదేశం, జనసేన కీలక నేతలు భేటీలు నిర్వహించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఈ రెండు పార్టీల నడుమ పొత్తు పొడిచింది. కలిసి పోరాటాలు చేశారు. అనివార్యంగా చంద్రబాబు బయటకు వచ్చాక జనసేన నేత పవన్‌కళ్యాణ్ కూడా ఆయనతో భేటీ అయ్యారు. అక్కడే రాజకీయ వ్యూహం నడిచింది. రెండు పార్టీల శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దీంతో వ్యూహాత్మక భేటీలు జరిగాయి. ఈ భేటీలతో రాజకీయంగానూ నియోజకవర్గాల్లో సమీకరణల్లోనూ మార్పులు తప్పవనే చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో జనసేన వామపక్షాలు, బిఎస్పీతో కలిసి పోటీ చేసింది. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశంతో జతకట్టింది. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ పరిణామం రెండు పార్టీలకూ మేలు చేసే అంశంగానే కనిపిస్తోంది. ఓట్ల చీలిక ఆగిపోనుంది. గతంలో జరిగిన నష్టం ఇప్పుడు భర్తీ అవుతుందనే అంచనాల్లో తెలుగుదేశం అభ్యర్థులున్నారు. ఏదేమైనా ఈ రెండు పార్టీల కలయిక పాలకపక్షంలోనూ చర్చకు దారితీస్తోంది.

విజయవాడలో సిపిఎం తలపెట్టిన ప్రజారక్షణభేరి సభకు జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు, వామపక్ష అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎన్నికల సమయంలో జిల్లా సమస్యలపై బస్సుయాత్రలు చేపట్టి వాటి కోసం బహిరంగ సభ నిర్వహించారు. జిల్లాలోనూ సిపిఎం బస్సుయాత్ర జరిగిన సంగతి తెలిసిందే.. ప్రజా సమస్యలతో పాటు రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయంపై సిపిఎం నేతలు తమ ఉపన్యాసాల్లో స్పష్టంగా ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో లబ్ధి కోసం వైసిపి–తెలుగుదేశం రెండు పార్టీలు.. బిజెపి భజన చేయడాన్ని సిపిఎం ఈ సందర్భంగా ప్రస్తావించింది.

'సంకల్పయాత్ర'ను జయప్రదం చేయండి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వికిసిత్ భారత్ సంకల్పయాత్రను జిల్లాలో జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం వీక్షణ సమావేశం ద్వారా కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టణ, గ్రామాలలో విస్తతమైన ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలోని 459 పంచాయతీలలో యాత్ర సాగుతుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నాలుగు వాహనాలు జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. జిల్లాస్థాయిలో 37 మంది అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించామన్నారు. అదే మాదిరిగా మండల స్థాయిలోనూ ఎంపీడీవోలు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న కాలనీలలో జగనన్న కాలనీలలో 153 మౌలిక సదుపాయాల పనులలో కేవలం 23 పనులే పురోగతిలో ఉండటం ఏమిటని అధికారులను నిలదీశారు. సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో పోలింగ్‌స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు పనిచేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, గహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, డిఆర్‌డిఏ పిడి అర్జున్ రావు, డిపిఓ డి రాంబాబు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఎస్ విజయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విద్యాసాగర్, పి ఆర్.ఎస్.ఇ హరేరామకష్ణ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో

మున్సిపల్ కార్మికుల నిరసనలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద, 21వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు తెలిపారు. యూనియన్ నగర కమిటీ సమావేశం నగర కార్యదర్శి యు రత్నకుమారి అధ్యక్షతన శనివారం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వస్తే దశలవారీగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, లేనిపక్షంలో సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరినీ రెగ్యులర్ చేయలేదని వివరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల స్థానిక సమస్యలు పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. సమావేశంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, యూనియన్ రాష్ట్ర నాయకులు కె సామ్రాజ్యం, నగర నాయకులు టి విజయ, ఆర్ రాములు, సిహెచ్ సింహాద్రి, ఆర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే స్వామి

చంద్రబాబు సీఎం అయితే పసిడి ఫలితాలు: స్వామి

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రానికి చంద్రబాబునాయుడు సిఎం అయితేనే ప్రతి ఒక్కరికీ పసిడి ఫలితాలు దక్కుతాయని కొండపి శాసనసభ్యులు శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం మండలంలోని ఇలవరలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు బి.యలమందనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్యచౌదరి, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు బి.ప్రసన్నలక్ష్మి, యంపిటిసి బి.వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

'సిఎం రిలీఫ్' చెక్కు అందజేత

ప్రజాశక్తి-కనిగిరి

వైసీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారినీ ఆదుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 13వ వార్డులోని మదీనా మసీద్ వీధికి చెందిన ఎస్కే మహబూబ్ బాషాకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.60 వేలను శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గఫార్, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తమ్మినేని సుజాతరెడ్డి, ఎస్కే జాస్మీన్, పసుపులేటి దీప, వేల్పుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్, సిఎస్ఆర్ఎంఒ

జిజిహెచ్‌లో 'సురక్ష' కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-ఒంగోలు

ఆరోగ్య సురక్ష వైద్యసేవల సమాచారం రోగులకు అందజేసేందుకు జిజిహెచ్‌లో కంట్రోల్ రూమ్‌ను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్, ఇన్‌ఛార్జి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ తిరుమలరావు శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం పేదల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామంలో జరిగిన క్యాంపులలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా స్పెషాలిటీ వైద్యసేవల కోసం వారిని జిజిహెచ్‌కు రిఫరల్ చేశారు. పేషెంట్ సౌలభ్యం కోసం వారిని ఏ విభాగాలకు వెళ్లాలి మరియు ఇతర సమాచారం అందించడానికి ఓపీ విభాగం దగ్గర, ఆర్ఎంఒ రూమ్‌కి ఎదురుగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రిఫర్ చేసిన కేసులకు సంబంధించి.. హాస్పిటల్‌లో హాజరు కాని వారికి ఫోన్ చేసి కౌన్సిలింగ్ నిర్వహించి హాస్పిటల్‌లో వైద్య పరీక్షలకు హాజరయ్యేలా చేయడం కోసం సుమారు 30 మంది నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు మరియు ఇతర సిబ్బందిని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ వైద్య సేవలు అనుబంధంగా జగనన్న బడుగు వికాసం పథకం కింద బాపట్లలో సిటీ, ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషదాయకమని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం బాపట్ల పాత బస్టాండ్ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బాపట్ల సిటీ, ఎంఆర్ఐ స్కాన్ సెంటర్‌ను కలెక్టర్ శాసనసభ్యులు కోన రఘుపతితో కలిసి ప్రారంభించారు. దినదినాభివద్ధి చెందుతున్న బాపట్ల జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా వైద్యశాల మరో ఏడాదిలో అందుబాటులోకి వస్తాయని కోన రఘుపతి తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ పి.వెంకట రమణ, ఆర్‌డిఓ జి.రవీందర్, డిఎంహెచ్ఒ ఎస్.విజయమ్మ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్ మోహన్ శెట్టి, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ పాల్గొన్నారు.

భాష్పాంజలి

నిరాడంబరుడు... సేవా తత్పరుడు...
అందరి ఆత్మీయుడు...
కీ॥శే॥ పావులూరు వెంకటకృష్ణారావు గారి
అకాల మరణానికి చింతిస్తూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...
వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...

కీ.శే. పావులూరి వెంకటకృష్ణారావు గారు
మాజీ అధ్యక్షులు, రోటరీక్లబ్ ఆఫ్ మార్టూరు,
మాజీ అధ్యక్షులు, శ్రీ విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం, మార్టూరు

Rtn వేమూరి శ్రీనివాస్	Rtn చెరుకూరి సీతారామయ్య	Rtn మాదాల సాంబశివరావు
Rtn గోవాడ వెంకటేశ్వరరావు	Rtn కల్లేపల్లి ఆంజనేయరాజు	Rtn చుండూరి చిన్నబాబు
Rtn ముద్దన శ్రీనివాసరావు	Rtn కందిమళ్ళ రాకేష్	Rtn కొర్రపాటి వేణుగోపాలరావు
Rtn వీరన్నపాటి శ్రీనివాసరావు	Rtn నాతాని ఆశోక్	Rtn కొయ్యలమూడి హనుమంతరావు
Rtn మండవ నరేంద్రబాబు	Rtn చెరుకూరి వేణు	Rtn పెంట్యాల లక్ష్మీనారాయణ
Rtn జాష్టి వెంకట మోహన్‌రావు ఎఫర్డ్ డైరెక్టర్	చెన్నుపాటి బసవరాములు రోటరీ మాజీ అధ్యక్షులు	శానంపూడి లక్ష్మయ్య రోటరీ మాజీ అధ్యక్షులు
షేక్ ఖాజా హుస్సేన్ రోటరీ మాజీ అధ్యక్షులు	దొడ్డా రమేష్ బాబు రోటరీ మాజీ అధ్యక్షులు	జాష్టి సాంబశివరావు రోటరీ మాజీ అధ్యక్షులు
రావి అంకమ్మ చౌదరి రోటరీ మాజీ అధ్యక్షులు	కొర్రపాటి కాజారావు రోటరీ మాజీ అధ్యక్షులు	చెరుకూరి అంజిబాబు రోటరీ మాజీ సెక్రటరీ
మురకొండ ఈశ్వర్ ప్రసాద్ రోటరీ మాజీ సెక్రటరీ	కుర్రా వెంకటరామయ్య రోటరీ మాజీ సెక్రటరీ	వి. వెంకట శేషుబాబు రోటరీ మాజీ సెక్రటరీ
గరిమిడి శ్రీనివాసరావు రోటరీ మాజీ ట్రెజరర్	కందిమళ్ళ రవిబాబు రోటరీ మాజీ ట్రెజరర్	ఇంటూరి ఆంజనేయులు అసిస్టెంట్ గవర్నర్
తాళ్లూరి సాంబశివరావు రోటరీ అధ్యక్షులు	చెరుకూరి నాగేశ్వరరావు రోటరీ ట్రెజరర్	నార్నెపాటి శ్రీనివాసరావు ఆర్.ఎం.పి.
గుండవరపు వెంకటప్రసాద్ ఎస్వి గ్రానైట్	కొప్పుల వెంకటరెడ్డి	మండవ శ్రీమన్నారాయణ
చింతల సుబ్బారావు	నల్లూరి శ్రీనివాసరావు	మక్కెన వీర రాఘవులు

రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు